# అర్థంకానిది - అతివమనసు

ఇంకా మెడ్రాసు మెయిల్ రాలేదు. సిగిరెట్ తాగుతూ ప్లాటుఫారంమీద అటూ ఇటూ తిరుగుతున్న కృష్ణమూర్తి అనుకోకుండానే ఆడ వాళ్ళ వెయిటింగురూముకేసి చూచాడు. చూపు నిలచీ నిలవగానే "అరె! రాధారాణి కాదుగదా" అనుకున్నాడు. సిగరెట్ పారేసి ముందుకు నడిచాడు. రాధారాణి వెయిటింగు రూము గుమ్మంలో నిల్చుని ఎటో చూస్తోంది ఎవరికోసమో! దగ్గరగా వెళ్ళి "మిసెస్-రాధారాణీ" అన్నాడు కృష్ణమూర్తి. రాధ వులికిపడి ప్రక్కకు చూచింది. "ఓ, మీరా!" అంటూ అతన్ని పైనుంచి క్రిందకు నవ్వుతూ చూచింది. అతడు వేసుకున్న పల్చని నైలానుస్లాక్ చూసి "ఇతడేమీ మారలేదు" అనుకుంది. "ఎక్కడికో వెళ్తున్నారు?" అన్నాడు కృష్ణమూర్తి. "వూఁ, మెడ్రాసుకు" అన్నది రాధ.

"ఒంటరిగా వెళ్తున్నారా" కాదు లెమ్మని వూహించుకునే చిలిపితనానికి అడిగాడు.

రాధ చిరునవ్వుతో "ఉహూఁ వారూ వస్తున్నారు" అంది. అంతలోనే ఒకాయన రాధ దగ్గరకు వచ్చి "ఏమో, నువ్వడిగిన నవల ఒక్కటీ దొరకలేదు" అన్నాడు.

రాధ అతనికి సమాధానంగా "పోనీలెండి" అని, కృష్ణమూర్తికేసి తిరిగి "వీరు కృష్ణమూర్తిగారు. వాల్తేరులో తెలుసును. ఫిజిక్సులో యం. యస్‌సి. చేసారు" అన్నది. అతడు చిరునవ్వుతో కృష్ణమూర్తికి

చెయ్యందిచ్చాడు. కృష్ణమూర్తి రాధ భర్తను చూచి, చిన్నగా భుజాలు కుదించుకుని "రాధ సెలక్షను ఫరవాలేదే!" అనుకున్నాడు. ముగ్గురు నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు. యింతలో ఒకమ్మాయి - మూడేళ్ళుండవచ్చు-రాధ దగ్గరకువచ్చి "ఇంకా రైలెప్పుడొస్తుందమ్మా" అంది. యిప్పుడే వచ్చేస్తుంది పాపా, ఎందుకు, ఏం కావాలి?" అంది రాధ.

"రెండు టాఫీస్ యియ్యమ్మా."

"అదా సంగతి? యిందాకేగా యిచ్చాను. మళ్ళీ రైల్లో-సరేనా."

"ఇందాక నువ్విచ్చింది నాన్న తీసుకున్నారమ్మా."

"ఏం?" అంటూ రాధ భర్తవంక చూచింది. ఆయన నవ్వుతూ కూతురికేసి చూస్తూ "నువ్వేగా పాపా నాకిచ్చావు" అన్నాడు. "బాగుంది, యిద్దరిద్దరే!" అని రాధ లోపలికెళ్ళి చేతినిండా స్వీట్సు పట్టుకొచ్చింది. "యీ రెంటూ ఆ మామకివ్వు, ఈ రెండు నాన్నకు, యీ రెండు నీకు, చాలా?" అంది పాపతో. పాప వాటిని సంబరంగా పంచింది అందరికి. కృష్ణమూర్తి పాప నెత్తుకుని ముద్దు చేశాడు. రాధవంక చూసి "యీపాప-" అన్నాడు ప్రశార్థకంగా. రాధ "మా అమ్మాయే" అంది చాలా సహజంగా. కృష్ణమూర్తి రాధ భర్తవంక చూచాడు. ఆయన రాధ వంక చూస్తున్నాడు. ఎంతో ఆప్యాయత, కృతజ్ఞత తొణికిసలాడుతున్నాయతని చూపుల్లో! కృష్ణమూర్తి గుక్క తిప్పుకుని "అది కాదండీ, పేరేమిటని నేనడుగుతా!-" అన్నాడు.

"మామయ్యకు నీ పేరు చెప్పు పాపా" అంది రాధ.

"స్వన్న" అన్నది పాప. ముగ్గురూ నవ్వారు. యింతలో రైలు నొచ్చింది. "వెళ్ళొస్తానండీ" అని వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

• • •

సెకండ్‌క్లాసు కంపార్టుమెంటులో పై బర్తుమీద పక్కపరిచి కృష్ణమూర్తి నిశ్చింతగా ప్లాటుఫారంమీద పచార్లు ప్రారంభించాడు మళ్ళీ.

"కృష్ణమూర్తీ, కృష్ణమూర్తీ" అన్న పిలుపు విని సందేహంగా అటు యిటు చూచాడు. దగ్గరలోనే ఒక కిటికీలోంచి గోపాలరావు

నవ్వుతూ, చెయ్యివూపుతూ కనుపించాడు. కృష్ణమూర్తి ఎంతో సంతోషించాడు స్నేహితుణ్ణిచూసి. గబగబ నడిచి రైలెక్కాడు. "ఎక్కడికిరా" అని ఒకరంటే "ఎన్నాళ్ళకురా" అని ఇంకొకరంటూ భుజాలు, చేతులు నొప్పిపుట్టేట్టుగా నొక్కుకున్నారు.

"ఎక్కడికంటే చెప్పవేఁ" అన్నాడు కృష్ణమూర్తి.

"నువ్వు నన్ను చెప్పనిస్తేనా అసలు- మెడ్రాసుకే. లెదర్ ఇన్స్టిట్యూట్‌లో జాబ్ దొరికింది. ఎల్లుండి జాయినవ్వాలి. సరే, నీ మాటేమిటి? యీ ఏడాదంతా ఏం చేస్తున్నావ్? ఉద్యోగమేమీ చెయ్యదల్చుకోలేదేమిటి?" అన్నాడు గోపాలరావు.

"మా అమ్మ పోరు పడలేక పారిపోయివస్తుంటే దారిలో నువ్వూ, యిదే సోదా? నేను తెలియక అడుగుతాను, నేను వుద్యోగం ఎందుకు చెయ్యాలిరా?" అన్నాడు కృష్ణమూర్తి.

"ఉద్యోగం చెయ్యడం ఎందుకూ ఏమిటిరా నీ ముఖం?"

"కానుమరి ఎందుకు? మా నాన్న బోలెడంత నిలవ చేశాడు. నాతోపాటు యింకా పదిమంది బ్రతకచ్చు దానితో! కావాలంటే రేపు మా అబ్బాయి పడతాడా పాట్లన్నీ- నన్నిలా బ్రతకనీ!"

"అబ్బాయా! యిట్లా పైలాపచ్చీస్‌గా తిరుగుతుంటే పిల్లనిచ్చే మావఁన్నా దొరుకుతాడా అసలు? అబ్బాయట-అబ్బాయి గారికి!"

"ఒరే, మరీ అంత తీసిపారెయ్యకురా: ఎంతమందిని తిరగ్గొట్టేసానో తెలిస్తే అంత మాటనవు నువ్వు"

"ఘనుడివి, ఏమైనా చెయ్యగలవు. అయినా ఏ వంకతో త్రిప్పగొడుతున్నావ్"

"నే నంటే నేను కాదులే! మా నాన్న! ఆయనకు బోలెడంత కట్నం తీసుకొచ్చే కోడలు కావాలట! ఇంతవరకు ఆయన చెప్పిన ఏ మాటా వినలేదు నేను. పోనీలే యీ మాట విందామనుకున్నా - అంతే" అని నవ్వాడు కృష్ణమూర్తి.

"అయితే బిల్లువచ్చినా కట్నంమీద చూపు పోలేదురా?" అన్నాడు గోపాలరావు వాస్తవమైన ఆశ్చర్యంతో!

"అల్లుడికి కట్నమిస్తే బిల్లు వూరుకోదు కాని, కూతురికి పసుపు కుంకం యిచ్చుకుంటే బిల్లు కాదంటుందటరా?" అన్నాడు కృష్ణమూర్తి.

"వూఁ—బాగానే వుంది" నిట్టూర్చాడు గోపాలరావు.

"అరే చెప్పటం మర్చిపొయ్యాను. రాధ యీ ట్రెయిన్‌లోనే మెడ్రాస్‌కే వస్తూంది" అన్నాడు కృష్ణమూర్తి.

"రాధా, ఏ రాధ?" అన్నాడు గోపాలరావు. ఒక క్షణంపాటు అతని హృదయస్పందనం తీవ్రమైంది.

"వేషాలెయ్యకు-ఏ రాధో అయితే నువ్వంత వులిక్కిపడతావా, మన హిస్టరీ రాధ సంగతే నే చెప్పేది"

"రాధ!" గోపాలరావు మనస్సు మూలిగింది మెల్లగా.

"ఆమె భర్తకూడ వున్నాడు వెంట. అయితే మూడేళ్ళ పిల్లను చూపించి 'మా అమ్మాయే' అన్నదేవిటి?"

"ఔను నీకు తెలియదేంటి? రాధ అతనికి రెండో భార్య." ఒక క్షణం ఆగి "గోపాల్ నిజం చెప్పరా, రాధ నిన్ను కాదని అతణ్ణి ఎందుకు చేసుకున్నదంటావ్" అన్నాడు కృష్ణమూర్తి.

గోపాలం కంగారుగా "ఛీ, మనకిష్టం వచ్చినట్లు మనం అనుకో కూడదురా, నాకైతే కోరిక వుండేదన్నమాట నిజమే కాని రాధ అందు కెప్పుడూ సుముఖంగా లేదు—కాకపోయినా అతడు చాల బాగుంటాడని విన్నాను. అందుకనేనేమో!" నీరసంగా ముగించాడు.

"ఆట్టే కబుర్లు చెప్పకు! అతడు చాల బాగున్నమాటయితే నిజమే కాని అసలు కారణం నేను చెప్తా విను. అందరూ నీలాంటివాళ్ళు కాదురా- ఫస్టుక్లాసు ప్రయాణాలు, పట్టు చీరలు, రవ్వల నగలు-వాటికోసమే రాధ నిన్ను కాదనుకుంది" అన్నాడు కృష్ణమూర్తి, అరగంట క్రితం చూసిన రాధను గుర్తుకు తెచ్చుకుంటూ!

• • •

కబుర్లు చెప్పి చెప్పి అలసిపోయి అప్పుడే నిద్రపోయింది పాప. రాధ ఏదో పత్రిక చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పుతోంది. చదవడానికి మనసు పోలేదు. నిద్రపోతున్న పాపవంక తదేకంగా చూచింది. ఏడాది క్రిందటి సంఘటన తలుపుకు వచ్చిందామెకు.

ఆరోజు.... స్నేహితురాలు శ్యామల వచ్చింది.

"అతనికి ఒక కూతురుకూడ వుందటగా- మరి ఏమాలోచించు కున్నావ్" అంది శ్యామల.

"ఆలోచించడానికేముంది?" అంది రాధ. అది 'వద్దనటానికి ముందు ఆలోచించటం కూడ అవసరమా?' అన్న ధ్వనితో.

శ్యామల మనస్సు తేలికపడింది. "నిజం రాధా, బాగా చెప్పావు. అటువంటి సాహసాలు పూర్వకాలపు స్త్రీలు చేసేవారేమో కాని, మనవల్ల మాత్రం కాదు. కథల్లో చదువుతుంటే బాగానే వుంటుంది కాని బాబోయ్ తలుచుకుంటే భయమేస్తుంది" అన్నదామె. రాధ ముఖం మారిపోయింది.

ఆ మర్నాడు "రాధ, ఆ సంబంధానికే ఒప్పుకుందట" అని తల్లి చెప్తే శ్యామల నిర్ఘాంతపోయింది. వెంటనే రాధ యింటికివెళ్ళి "యింత దారుణం ఎందుకు చేశావ్ రాధా" అంది. రాధ నవ్వి "యిందులో దారుణ మేముంది శ్యామా! అయినా ఏమన్నా వున్నదీ అంటే అది చేసింది నువ్వేకాని, నేనుకాదు!" అంది. ఆలోచిస్తున్న రాధకు అప్రయత్నంగా నవ్వు వచ్చింది. "శ్యామల! ఏం చేస్తోందో" అనుకుంది. భర్తవంక చూచింది. అతడు సిగిరెట్ త్రాగుతూ కిటికీలోంచి బయట చీకట్లోకి చూస్తున్నాడు. ఆ పెట్టెలో యింకెవరూ లేరు. పత్రిక మూసిపెట్టేస్తూ "ఏమిటంతగా ఆలోచిస్తున్నారు" పలుకరించింది భర్తను. ఆయన యిటు తిరిగి భార్యకేసి క్షణం చూసి, సిగరెట్ పారేసి ఆమె దగ్గరగా వెళ్ళాడు. గబుక్కున ఆమె భుజాలమీద చేతులేసి బలంగా నొక్కుతూ, ఆమె కళ్ళలోకి చూసి "రాధా-నువ్వుచేసిన సాహసం, నువ్వు చూపిన త్యాగం- అదే ఆలోచిస్తున్నాను" అన్నాడు. రాధ తేలిగ్గా నవ్వేసింది.

---o---